# లాఠీచార్జ్ చేయడం అమానుషం

- కొనసాగుతున్న ఆశల నిరసనలు
- హామీల అమలుకు నిరంతరం పోరాటం

మదనాపురం, మార్చి 25 : తమ హక్కుల సాధనకు పోరాడుతున్న ఆశలపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలినిక్సన్ అన్నారు. ఆశ వర్కర్లతో కలిసి మంగళవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. నిక్సన్‌తో పాటు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు అనసూయ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేల హామీలను అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్ కోఠి దగ్గర ధర్నా చేస్తుంటే పోలీసులు లాఠీచార్జ్ చేసి అరెస్టు చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో ఆశలు భాగ్యలక్ష్మి, గంగ, సుహాసిని, యశోధ, శారద, సుజాత, సలీమాబేగం, మౌలానబి, నాగలక్ష్మి, మాధవి, శైలజ పాల్గొన్నారు.



మల్దకల్ బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

**ఏడోహామీ ఏమైంది సారు..!**

గద్వాలటౌన్, మార్చి 25 : రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైంది సారు అంటూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నరసింహ ప్రశ్నించారు. ఆశ వర్కర్ల అక్రమ అరెస్టులకు నిరసనగా మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆశలు పద్మ, సునీత, నాగప్రమీల, కవిత, శ్రీదేవి పాల్గొన్నారు.

**రూ.18వేలు వేతనం ఇవ్వాలి**

పాన్‌గల్, మార్చి 25 : ఆశలకు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల నాయకురాలు రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆశకార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హక్కులకోసం వెళ్లిన ఆశ కార్యకర్తలపై పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారని తెలిపారు.

**ఆశ కార్యకర్తలు రాస్తారోకో**

మల్దకల్, మార్చి 25 : ఆశల తమ డిమాండ్ల ఆశయ సాధన కోసం సంఘం అధ్యక్షురాలు కాంతమ్మ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గంటపాటు నిరసన సందర్భంగా గద్వాల్ -అయిజ రోడ్డు ప్రయాణికులకు ఇబ్బందులకు గురయ్యారు. కార్యక్రమంలో సరస్వతమ్మ, నర్సమ్మ, సుజాత, పరిమళ పాల్గొన్నారు.

**అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం**

గోపాల్‌పేట, మార్చి 25 : న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ..మంగళవారం ఆశ వర్కర్లు మండలకేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

**కొత్తకోటలో..**

కొత్త కోట, మార్చి 25 : కాంగ్రెస్ ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త కోట చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భాగ్య మాట్లాడారు. కొత్త కోటచౌరస్తాలో ఆశలు నల్ల బ్యాడ్జీలు ధరించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంజుల, పుష్ప, సంతోష పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్స్




గద్వాలలో నిరసన తెలుపుతున్న ఆశలు

## ఆయిల్‌పాంతో అధికలాభాలు పొందవచ్చు



రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్‌సురభి

అమరచింత, మార్చి 25 : వ్యవసాయంలో మారుతున్న పద్ధతులను అలవాటు చేసుకుని రైతులు పంట మార్పిడీలు చేపట్టి ఆయిల్‌పాం పంటను సాగుచేసి తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో అధిక దిగుబడితో పాటు అధికలాభాలను పొందవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాగల్‌కడ్మూర్ రైతువేదికలో వ్యవసాయశాఖ, ఉద్యానవానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతునేస్తంలో కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర పంటలతో పోలిస్తే అయిల్‌పాం పంటకు తక్కువ పెట్టుబడితో పాటు సాగునీటి అవసరం ఎక్కువగా ఉండదని, రైతులకు శ్రమకూడా తగ్గుతుందన్నారు. త్వరలోనే జిల్లాల్లో పంటలను కొనుగోలు చేసేందుకు ప్రియునిక్ అయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని అయన పేర్కొన్నారు. అంతకుముందు బాలకిష్టాపూర్‌లో 50ఎకరాల్లో సాగుచేసిన లక్ష్మీకాంత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమానికి ఏవో అరవింద్ అధ్యక్షత వహించగా ఏఈవోలు శివ ఉన్నారు.

**ఇందిరమ్మ మోడల్‌హౌస్ పరిశీలన**

కొత్త కోట, మార్చి 25 : కొత్తకోట పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్, హౌసింగ్ పీడీ పర్వతాలు, డీఈ విటోభా, ఉద్యాన శాఖ అధికారి అక్బర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కలెక్టర్ వెంట ఉన్నారు.

**ప్రసవాలసంఖ్య పెంచాలి**

వనపర్తి టౌన్, మార్చి 25 : ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు అన్నిరకాలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీనివాసులుతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్సి (ప్రెగ్నెన్సీ) రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరగాలని సూచించారు. ఆశవర్కర్లతో డేటా తెప్పించుకొని గ్రూపులు ఏర్పాటు చేసి ఏఎన్సి రిజిస్ట్రేషన్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీబీ సర్వేలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సమావేశంలో సాయినాథ్‌రెడ్డి, రామచంద్ర, జీజీహెచ్ సూపరింటెండెంట్ రంగారావు, మెడికల్ ఆఫీసర్లు ఇతర అధికారులు తదితరులున్నారు.

## సంస్థానాధీశుల కోట కట్టడాలను కాపాడాలి



నిరసన సభలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు


- అఖిల పక్ష నాయకుల డిమాండ్

గద్వాల టౌన్, మార్చి 25 : సంస్థానాధీశుల కాలం నాటి కొత్తబావి ఆనవాలు లేకుండా పూడ్చివేసి కబ్జాకు పాల్పడిన మాజీ మున్సిపల్ చైర్మన్ వేణుగోపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. పురాతన కట్టడాలను, బావులను, భవనాలను, కోటను పరిరక్షించాలంటూ మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన సభ నిర్వహించారు. సంస్థానాధీశుల కాలం నాటి అపురూప కట్టడాలన్నీ కూడా కబ్జాలకు గురువుతున్న పట్టించుకునే వారే లేరన్నారు. పురావస్తుశాఖ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కట్టడాలను పరిరక్షించకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం, పురాతన కట్టడాల పరిరక్షణ సమితి, తెలంగాణ ప్రజాఫ్రంట్, బీఆర్ఎస్, సీపీఎం, వివిధ సంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కుర్వపల్లయ్య, మోహన్‌రావు, ప్రభాకర్, వెంకటస్వామి, ఆంజనేయులు, శ్యామ్, షఫి తదితరులు పాల్గొన్నారు. సంస్థానాధీశుల బావులను, కట్టడాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బీజేపీ నాయకుల అన్నారు.

## ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి .. చెక్ డ్యాంలో శవమై కనిపించాడు

గోపాల్‌పేట, మార్చి 25 : ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి చెక్ డ్యాంలో శవమై కనిపించిన సంఘటన మండలంలోని మున్ననూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. వనపర్తి పట్టణం గాంధీనగర్ కాలనీకి చెందిన ఆవుల శ్రీను(40) మేస్త్రి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 23న ఆదివారం అతడు మున్ననూర్ బందువుల ఇంటికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో గ్రామ శివారులోని కొత్త బావిచెక్‌డ్యాంలో తాగినమైకంలో ఈతకొడుతూ.. నీట మునిగి ప్రాణాలు వదిలాడు. కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. మంగళవారం శ్రీను చెక్ డ్యాంలో శవమై తేలాడు. శవాన్ని గుర్తుపట్టి అతడి బందువులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఆవుల విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసున మోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానాలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## తేనెటీగల పరిశ్రమలతో ఆదాయం రెట్టింపు



శిక్షణలో మాట్లాడుతున్న డీన్ సైదయ్య

పెద్దమందడి, మార్చి 25 : రైతులు తేనెటీగల పెంపకాన్ని అదనపు ఆదాయపు వ్యాపకంగా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా చేపట్టవచ్చని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సైదయ్య అన్నారు. మంగళవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో ఉన్న కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యాన కళాశాల వేదికగా జిల్లా స్థాయి తేనెటీగల పెంపకం శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశంలో లభించే తేనే అత్యంత శ్రేష్ఠమైనదని, పోషక విలువలతో పాటు ఔషద గుణాలు ఉండటం వల్ల ఎగుమతికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులకు శిక్షణ ఇప్పిస్తామని శాస్త్రవేత్త డాక్టర్ నిఖిల్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షహనాజ్ శాస్త్రవేత్త నిఖిల్, పోతరాజయ్య రైతులు హాజరయ్యారు.

**ఉచితబోర్లకు దరఖాస్తులు చేసుకోవాలి**

అలంపుర్ చౌరస్తా, మార్చి 25 : ఉండవల్లి మండలానికి ఎస్సీ వ్యవసాయదారులకు 16బోర్లు వేసుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో తిరుపతన్న తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను ఇవ్వాలన్నారు. పది రోజుల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

## ఎండకు దుప్పటే రక్షా...



రోజురోజుకు ఎండ తాకిడికి పాఠశాలలకు తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు వెళ్లే పరిస్థితి. తిరుగు ప్రయాణంలో ఎండ వేడికి తట్టుకోలేక దుప్పటి కప్పుకుని ఇండ్లకు వెళ్తున్న ఫొటో సోషల్ మీడియాల్లో వైరల్‌అయ్యింది. ఈ దృశ్యం అలంపూరులో మంగళవారం మధ్యాహ్నం కనిపించింది. –అలంపూర్, మార్చి 25

## పంట పొలంలో పడి యువకుడి మృతి

ధరూరు, మార్చి 25 : ప్రమాదవశాత్తు పంట పొలంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై కొండ శ్రీహరి తెలిపారు. మండలంలోని కోతుల గిద్ద స్టేజి సమీపంలోని వరి పంట పొలంలో ఓ యువకుడు పడి మృతి చెందినట్లు స్థానిక రైతులు తెల్లవారు జామున గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అనవాలు ప్రకారం గద్వాలకు చెందిన దర్శెల్లిగా గుర్తించారు. అయితే యువకుడు పడి వున్న చోట మద్యం సీసాలు లభ్యమవడంతో, రాత్రి సమయంలో మద్యం తాగి మల మూత్ర విజర్జనకు వచ్చి మత్తులో తూగుతు మూతి కుట్టుకుని పడడంతో ఊపిరాడక చని పోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

**రెసిడెన్సియల్‌ను న్యాయమూర్తి సందర్శన**

గద్వాల అర్బన్, మార్చి 25 : పాఠశాలలో ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు న్యాయమూర్తి కవితాదేవి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ పాఠశాలను న్యాయమూర్తి అకస్మిక సందర్శించారు. పాఠశాలలోని వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ వయస్సులో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు.

**రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి**

వనపర్తి టౌన్, మార్చి 25 : యూజీసీ నూతన నిబంధనల ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని మార్చి 26న పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. సదస్సుకు వైస్ చాన్సలర్ శ్రీనివాస్‌యాదవ్, ఇంచార్జ్ రిజిస్టర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు విజయకన్నా హాజరవుతారన్నారు.

**అక్రమ నిర్మాణాలు తొలగింపు**

అలంపుర్ చౌరస్తా, మార్చి 25 : ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులో అక్రమ నిర్మాణాలను మంగళవారం ప్రభుత్వ అధికారులు తొలగించారు. తాసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ, సిబ్బంది, పోలీసుల సహకారంతో పుల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోలోగేట్ వద్ద 440 సర్వే నెంబరులో అక్రమంగా నిర్మించిన భవనాలను జేసీబీతో అక్రమ నిర్మాణాలను తొలగించామని తాసీల్దార్ తెలిపారు.

**యువతి అదృశ్యం**

రాజోలి, మార్చి 25 : మండలానికిచెందిన మహబూబ్ బాషా రెండో కూతురు(25) మంగళవారం సాయంత్రం నుంచి కనపడటంలేదని రాజోలి స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జగదీశ్ కేసున మోదు చేసుకొని విచారణ చేపట్టాడు. అదే గ్రామానికి చెందిన ప్రదీప్ అనే వ్యక్తిపై అనుమానం వుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ముందస్తు అరెస్టులు**



వీవోఏలరె అరెస్టు చేసిన పోలీసులు

వడ్డేపల్లి, మార్చి 25 : సమాన పనికి సమాన వేతనం , ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి ఉద్యోగభరోసా ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా వున్న వీవోఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో సెర్ప్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం తలపెట్టగా మండలంలోని 7 మంది వీవోఏలను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

**రహదారి నిర్మాణంతో ఉపయోగం**

ఇటిక్యాల, మార్చి 25 : ప్రభుత్వం నుంచి నూతనంగా మంజూరైన రోడ్డు నిర్మాణం ఉపయోగకరంగా ఉంటుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మండలకేంద్రం నుంచి పెద్దదిన్నె గ్రామం వరకు గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. రెండుగ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 26ఏఎల్‌పీ51ఎః రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

## జోగుళాంబ ఆలయాభివృద్ధికి ప్రణాళికలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

- గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, మార్చి 25 : జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆలయాలు, ఆధ్యాత్మికత, అవసరాలు, స్థిరమైనా పర్యాటకాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర పునర్వ్యవస్థీకరణ ప్రధాన ప్రణాళికపై కలెక్టర్ అధ్యక్షతన జోగులాంబ దేవస్థానం అభివృద్ధి కోసం ఏర్పాటైనా పర్యవేక్షణ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ పురుద్ధరణ ప్రణాళికను అర్కిటెక్ సూర్యనారాయణమూర్తి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అలంపుర్ తెలంగాణలో ఏకైక శక్తి పీఠంగా ఉన్నందున దీని ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధితో పాటు పర్యాటక అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఆలయ పరిసరాల అభివృద్ధి, సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రసాద్ పథకం భవనానికి నీటి సరఫరా కోసం మున్సిపల్ కమిషనర్, ఇంట్రా ఈఈ, పబ్లిక్‌హెల్త్ ఇంజినీర్లు నది నుంచి నీటిశుద్ధి విషయమై క్షేత్రస్థాయి పర్యటన చేసి 15 రోజుల్లో అంచనాలను అందజేయాలన్నారు. ప్రసాద్ పథకం భవనాన్ని టూరిజం శాఖ అధికారులు వెంటనే దేవాదాయశాఖకు అప్పగించాలని సూచించారు. ఆలయానికి అనుసంధానించే రహదారుల అభివృద్ధికి గాంధీ జంక్షన్ నుంచి ఆలయం వరకు రహదారి వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులకు శాఖల వారీగా వారం రోజుల్లో ప్రతిపాదనలు అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఆలయ డిజైనర్‌లు గణేశ్, గోవిందహరి, అధికారులు నాగలక్ష్మీ, పురేందర్, మంజుల, చంద్రశేఖర్‌రావు, వనజారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై మరింత నమ్మకం పెరగాలి

- ఎస్పీ తోట శ్రీనివాసరావు



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ తోటశ్రీనివాసరావు

గద్వాల అర్బన్, మార్చి 25 : ఆయా సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం చేయడం ద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత నమ్మకం పెరుగుతుందని ఎస్పీ తోటశ్రీనివాస రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో ఆయా పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులతో పాటు ఆయా కేసులకు సంబంధించి విషయాలను ఆరా తీశారు. ఈ క్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి డిస్పోజల్ చేయాలన్నారు.సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగిలయ్య, అధికారులు నాగేశ్వర్ రెడ్డి, శ్రీను, రవి బాబు, టాటా బాబు తదితరులున్నారు..

## గోదాంలో కనీస సౌకర్యాలు కల్పించరూ !



కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్న లారీడ్రైవర్లు

అమరచింత, మార్చి 25 : మండలంలోని ధర్మాపూర్ శివారులో రూ.10 కోట్ల నిధులతో చేపట్టిన సివిల్‌సప్లయ్ గోదాంలో పని చేసే కూలీలకు, ధాన్యం తీసుకువచ్చే లారీడ్రైవర్లకు, సిబ్బంది తాగడానికి మంచినీటితో పాటు ఉండడానికి కనీసం నీడ సౌకర్యాలు కల్పించాలని కూలీలు, లారీడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం లారీడ్రైవర్లు నిజాం, అంజప్ప, రాయుడు, ఆశోక్ తదితరులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణపేట జిల్లా కొడగంల్, మద్దూర్, మరికల్ మండలాల నుంచి ఇక్కడి గోదాంకు లారీలో ధాన్యం తీసుకువచ్చి నాలుగురోజులు అవుతందన్నారు. అన్‌లోడ్ చేసుకునేందుకు బీహార్‌కు చెందిన కూలీలు తక్కువగా ఉండడంతో లారీలను గోదాం లోపలికి కూడా రానివ్వకుండా ఆరుబయట నిలిపివేశారని, మండలకేంద్రం, ధర్మాపూర్, పక్కనే ఉన్న నాగల్‌కడ్మూర్‌కు రెండు నుంచి 3 కిలో మీటర్ల దూరంలో గోదాం ఉండడంతో ఇరవై లారీలకు పైగా ధాన్యం లోడుతో వచ్చిన డ్రైవర్లకు తినడానికి తిండి దొరకక, తాగడానికి మంచినీరు లేవని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కూలీలకు, లారీడ్రైవర్లకు మంచినీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విషయంపై గోదాం అధికారి సోమయ్యను నమస్తే వివరణ కోరగా.. గోదాం లోపల సివిల్‌సప్లయ్ సంస్థకు చెందిన బోరు ఉందని కూలీలైనా, డ్రైవర్లయినా ఆ నీరే తాగాలని నాది మంచినీరు సరఫరా ఉద్యోగం కాదన్నారు. గోదాంకు ఎంతధాన్యం వచ్చింది చూసుకోవడం మాత్రమే తన పనని విసుగ్గాట సమాధానం ఇచ్చారు.

## అనాథ చిన్నారులకు ఆర్థికసాయం

మల్దకల్, మార్చి 25 : మండలంలోని చర్లగార్లపాడు గ్రామంలో కుమ్మరి వీరేశ్, కుమ్మరి భారతిలు గత నెలలో వివిధ కారణాల వల్ల మృతి చెందిన విషయం విధితమే. కాగా వారికి ముగ్గురు సంతానం వారిలో నందకిశోర్, గణేశ్, వైష్ణవి ఉన్నారు. కుటుంబ యజమానులు మృతిచెందడంతో వారు అనాథలుగా మిగిలి పోయారు. చిన్నారుల కుటుంబ పోషణకు దాతలు ముందుకు వచ్చి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.మంగళవారం గద్వాల్ పట్టణానికి చెందిన కుమ్మర శాలివాహన సంఘం అధ్వర్యంలో రూ.50 వేలు నగదును ఆ చిన్నారులకు అందజేశారు.



పంచాగాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

## ఉగాది పంచాగాన్ని ఆవిష్కరించిన ఎస్పీ

వనపర్తి టౌన్, మార్చి 25 : విశ్వబ్రాహ్మణ వేద పండితులచే రూపొందించిన విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా పంచాంగాన్ని ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజశ్రేయస్సు , ప్రజలను చైతన్యపరిచే ప్రబోధాలు అర్చకుల నుంచి రావాలని ఆయన కోరారు. అర్చకులు వల్లించే మంత్రాల యొక్క విశిష్టత , అర్థః తెలియజేసే భక్తులను సన్మార్గం వైపు మళ్లించాలన్నారు. అనంతరం వేదపండితులు ఎస్పీని సత్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం జిల్లాధ్యక్షుడు నారాయణదాసు , గోవర్ధనాచారి, లవకుమారాచారి, హిమవంతాచారి, నరసింహాచారి, బ్రహ్మాచారి, బైరోజు చంద్రశేఖర్, విరాట్‌అచారి, శ్రీహరి ఆచారి, విక్రమ్ ఆచారి పాల్గొన్నారు.

**కేఎల్ఐ కాల్వకు మరమ్మతులు చేపట్టాలి**

పాన్‌గల్, మార్చి 25 : మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా సమీపంలో ఎంజీకేఎల్ఐ డిస్ట్రిబ్యూటర్-8 చివరి ఆయకట్టు దగ్గర నీటి ఉధృతికి కేఎల్ఐ కాలువ కోతకు గురై తెగిపడిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు బాబునాయక్, రవినాయక్, తులసీనాయక్ ఆధ్వర్యంలో అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో తెగిన కేఎల్ఐ చివరి ఆయకట్టు కాలువను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేఎల్ఐ కాలువ తెగిపోవడం వల్ల తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లి తండాలో దాదాపు 10ఎకరాల పంట నష్టం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు తెలుపగా ఒకరిపై మరొకరు చెప్పుకుంటున్నారని, సమస్యను పరిష్కరించడంలేదని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు స్పందించిన వెంటనే తెగిన కాలువకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు**



ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు

కొత్తకోట, మార్చి 25 : కొత్తకోట మున్సిపాలిటీలోని వివిధ మసీదులలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేషిణి విశ్వేశ్వర్ జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ తరఫున ముస్లిం సోదరులకు పండ్లతో మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని జామే మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్ పాల్గొన్నారు.

**నేడు ఇఫ్తార్ విందు**

వనపర్తి టౌన్, మార్చి 25 : రంజాన్ పండుగను పురస్కరించుకొని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డిలు ముస్లిం సోదరులకు బుధవారం ఇఫ్తార్‌విందును ఇవ్వనున్నట్లు వారు వెల్లడించారు. ఈ విందులో వారు పాల్గొని జిల్లా కేంద్రంలోని జామా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొననున్నారు.

**కొలతల ప్రకారం కూలీ ఇవ్వాలి**

అయిజరూరల్, మార్చి 25 : ఉపాధిహామీ పనుల్లో కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.300 కూలీ వస్తుందని ఎంపీడీవో వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎక్లాస్‌పురం శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఆయనవెంట ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రాములు తదితరులున్నారు.


**రాయితీపై వ్యవసాయ పనిముట్లు**

వడ్డేపల్లి, మార్చి 25 : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఉప-మిషన్ పథకం ద్వారా మహిళా రైతులకు 50 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందజేస్తామని వ్యవసాయఅధికారి రాధ ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు 5, తైవాన్ స్ప్రేయర్లు 5, రోటో వీటర్లు 2, కల్టివేటర్, ఎంబీప్లవ్, కేజీవీల్‌లు 3 అందజేయనున్నామన్నారు.

**నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి**

వడ్డేపల్లి, మార్చి 25 : నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని తాలూకా అధ్యక్షుడు గోవింద్ అన్నారు. మంగళవారం శాంతినగర్‌లోని ఆదినారాయణ స్వామి ఆలయం వద్ద సంఘం తాలుకా సమావేశం నిర్వహించారు. తాలూకా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలన్నారు.

**గొర్రెల దొంగలు అరెస్టు.. రిమాండ్‌కు..**



వివరాలను వెల్లడిస్తున్న సీఐ శివకుమార్, ఎస్సై సురేశ్

అమరచింత, మార్చి 25 : మండలంలోని చింతరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 22 న జరిగిన గొర్రెల దొంగతనం చేసని కేసులో ముగ్గురువ్యక్తులను అరెస్టుచేసి మంగళవారం ఆత్మకూర్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశం మేరకు డిమాండ్‌కు తరలిస్తున్నామని ఆత్మకూర్ సీఐ శివకుమార్, ఎస్సై సురేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. నర్వ మండలం ఎల్లంపల్లికి చెందిన కుర్వ నాగరాజు అమరచింత మండలంలోని చింతరెడ్డిపల్లి శివారులోని వ్యవసాయ పొలాల్లో గత 20 రోజులుగా గొర్రెలను మేపుకొంటూ అక్కడ మందను నిలుపగా, అందులో 13 గొర్రెలను దొంగలించబడ్డాయి. తర్వాత గమనించి యజమాని అమరచింత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసున మోదు చేసి విచారణ చేపట్టడంతో మద్యానికి బానిసైన అదే గ్రామానికి చెందిన సురేశ్, మిట్టనందిమల్ల గ్రామానికి చెందిన మల్లేశ్, నందిమల్ల గ్రామానికి చెందిన భీమన్నతో కలిసి దొంగలించి ఆటోలో తీసుకువెళ్లి కోస్గి సంతలో అమ్ముకొన్నారు. వచ్చిన రూ.90వేల నగదు తల ఇంత పంచుకున్నట్టుగా విచారణలో తేలింది. కాగా నగదుతో పాటు వారు ఉపయోగించిన ఆటోను వారి నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సిబ్బంది నాగరాజు, పురుషోత్తం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.